నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 మహబూబ్‌నగర్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 MAHABUBNAGAR NARAYANPET



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న ముసురు వాన

# ముసురేసింది..

- ఉమ్మడి జిల్లాలో ముసురు వాన
- శీతల గాలులతో జనం వణుకు
- బయటకు రావాలంటే జంకు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో ముసురు వాన పడింది. అక్కడక్కడ మోస్తరు వర్షం తోపాటు పలు చోట్ల చిరుజల్లులు కురిసాయి. రెండ్రోజులుగా వాతావరణం మేఘావృత మైంది. దీనికి తోడు చలి గాలులు వీస్తుండడంతో జనం గజగజ వణికిపోతున్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ తదితర ప్రాంతాల్లో ముసురు పడింది. దీంతో యాసంగి పంటలకు సిద్ధమవుతున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. వాతావరణం పూర్తిగా మారిపోవడంతో జనం ఇండ్ల నుంచి బయటికి రావాలంటే జంకుతున్నారు. అత్యవసరమైతే స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరించి బయటకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చలి నుంచి రక్షణగా చలిమంటలు వేశారు. పొగమంచు కూడా కురుస్తుండంతో రహదారులపై వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు.



హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసిన జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్వీ నేతలు

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్వీ నేతలు

అయిజ, డిసెంబర్ 26 : ఎమ్మెల్సీ కవితను జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన బీఆర్ఎస్వీ జిల్లా నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో కలిసి బీఆర్ఎస్వీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించినట్లు బీఆర్ఎస్వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, పట్టణ మాజీ అధ్యక్షుడు కుర్వ వీరేశ్, మాధవ్, రాజు, భరత్ పాల్గొన్నారు.



నిమ్స్ దవాఖానలో మందను పరామర్శిస్తున్న హరీశ్‌రావు, మాజీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

## మందకు మాజీ మంత్రుల పరామర్శ

మహబూబ్‌నగర్/అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 26 : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం అనారోగ్యానికి గురికావడంతో కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, గద్వాల జిల్లా బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ పల్లయ్య దవాఖానకు వెళ్లి మందను పరామర్శించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అనంతరం నిమ్స్ వైద్యులతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

### వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

- నలుగురు యువకులపై కేసు నమోదు

గద్వాల అర్బన్, డిసెంబర్ 26 : గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడులు చేసి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్ కుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో నలుగురు యువకులు ఓ ఇంటిని కిరాయి తీసుకొని కొన్ని రోజులుగా గుట్టుగా వ్యభిచారం నిర్వహిసున్నారు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం అందడంతో వారు వ్యభిచార గృహంపై దాడులు చేసి ఒడిశాకు చెందిన మహిళతో పాటు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. రవి, తిరుమలేశ్, అరుణ్‌తో పాటు మరో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో నిల్వ ఉంచిన సీఎంఆర్ బస్తాలకు రెక్కలొచ్చాయి. గోదాంలో ఉన్న దాదాపు 300 బస్తాలు అపహరణ గురైనట్లు మిల్లర్ల తరుపు వారు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే మిల్లర్లే బియ్యాన్ని పక్కదారి పట్టించి దొంగతనం జరిగిందని తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సీజన్‌లోనూ మిల్లర్ల తీరు ఇదే తరహాలో ఉంటుందన్న విమర్శలు లేకపోలేదు. కస్టమైజ్ చేసిన రైస్ ప్రభుత్వానికి అందించకుండా మిల్లర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు.

– గద్వాల, డిసెంబర్ 26

# మిల్లులో దొంగలు పడ్డారు!



బీచుపల్లి వద్ద ఉన్న విజయ మిల్ గోదాంలో ఉన్న సీఎంఆర్ బస్తాలు

- విజయ మిల్ గోదాంలో సీఎంఆర్ రైస్ గాయబ్
- 300 బస్తాలు అపహరణకు గురైనట్లు పీఎస్‌లో ఫిర్యాదు
- అమ్ముకున్నారా..? అపహరించారా..? అన్న అనుమానాలు
- ప్రతి సీజన్‌లో పరిస్థితి ఇదేనంటూ విమర్శలు
- విచారణ చేపట్టిన పోలీసులు





బీచుపల్లి వద్ద ఉన్న విజయ ఆయిల్ మిల్

ప్రభుత్వం ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి ఆ ధాన్యాన్ని మర ఆడించడానికి మిల్లర్లకు కేటాయిస్తున్నది. కేటాయించిన బియ్యాన్ని అధికారుల సహకారంతో మిల్లర్లు బయటకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయం సివిల్ సప్లయి శాఖ అధికారులకు తెలిసినా ఇందులో వారికి కూడా భాగస్వామ్యం ఉండడంతో వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారి పక్కనే పోలీస్ బెటాలియన్ సమీపంలో ఉండే బీచుపల్లి ఆయిల్ మిల్ గోదాంలో ఉన్న మూడు వందల బస్తాల సీఎంఆర్ ధాన్యాన్ని గోదాంలో దొంగలు అపహరణ చేశారంటే ఇది సినిమా తలపించేలా ఉంది. గోదాంలోని ధాన్యం దొంగలు అపహరించారని బాధితుడు ఫిర్యాదు మేరకు రెండు రోజులుగా పోలీసుల విచారణ చేసినా చివరికి ఫలితం శూన్యం.

**కొత్త కోణాలు..**

పెబ్బేరుకు చెందిన సాయిగోపాల ఇండో టెక్ ప్లాంట్ యజమాని హరినాథ్ బీచుపల్లి సమీపంలో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి మిల్లు అద్దెకు తీసుకొని వడ్లను మరాడిస్తారు. అతనికే పెబ్బేరు సమీపంలో మరో మిల్లు ఉంది. ప్రభుత్వం ఈ మిల్లులకు సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయిస్తే వారు ఆ ధాన్యాన్ని లీజు తీసుకున్న బీచుపల్లి ఆయిల్ మిల్ గోదాంలో రెండేళ్లుగా నిల్వ చేస్తున్నారు. ఈయనతో పాటు సప్తగిరి రైస్ మిల్లుకు చెందిన వారు కూడా విజయ ఆయిల్ మిల్లును 2023లో అద్దెకు తీసుకొని వారు కూడా తమ మిల్లులకు ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని అందులో నిల్వ ఉంచుతున్నారు. అయితే గోదాంలో ఉన్న సీఎంఆర్ బస్తాలు అపహరణకు గురయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**అమ్ముకున్నారా.. అపహరించారా..?**

ప్రతి సీజన్‌లో జిల్లాలోని మిల్లర్లది ఇదే తీరు. ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లర్లు ముందుగా బయటకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే బీచుపల్లి విజయ ఆయిల్ మిల్లులో లక్షన్నర బ్యాగులు ఉండగా అందులో అపహరణకు 300బస్తాలు(40కేజీల)గురయ్యాయని ఫిర్యాదు చేశారు. చోరీకి గురైనా ధాన్యం అమ్ముకున్నారా...లేక దొంగలు అపహరించారా అనేది అనుమానాలకు తావిస్తోంది. గద్వాలకు చెందిన ముగ్గురు మిల్లర్లతో పాటు పెబ్బేరుకు చెందిన కొంతమంది మిల్లర్లు ప్రతి ఏడాది ప్రభుత్వానికి అందించాల్సి సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా ఎగవేస్తున్నట్లు తెలిసింది.

మిల్లులకు కేటాయించిన వడ్లను అమ్ముకుని ప్రభుత్వానికి బియ్యం అందించే సమయంలో డీలర్ల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వారి మిల్లులో రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే బీచుపల్లి విజయ ఆయిల్ మిల్లులో సీఎంఆర్ వడ్లను వాస్తవంగా దొంగలు అపహరించారాలేక అమ్ముకున్నారా అనే దానిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్పా అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశం లేదు. గతంలో ఇక్కడ నుంచి సీఎంఆర్ వడ్లు తరలిస్తున్నట్లు తెలిసింది. ఈనెల 24వ తేదీ లారీలోకి వడ్లు ఎత్తే క్రమంలో దీనిని చూసిన కొందరు 100కు సమాచారం అందించడంతో అసలు విషయం బయట పడినట్లు తెలిసింది. దీనికి తోడు జిల్లాలోని అన్ని మిల్లులను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశం ఉంది.

**రాత్రిపూట గుట్టుగా ధాన్యం తరలింపు**

బీచుపల్లి విజయ ఆయిల్ ప్రాంతంలో ఆయిల్ పాం మొక్కల పెంపకం జరుగుతుంది. అందులోనే ఆయిల్ మిల్లుకు సంబంధించి గోదాంలు ఉన్నాయి. అయితే మొక్కలకు ఎరువులు వస్తున్నాయని చెప్పి రాత్రి వేళల్లో ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎర్రపల్లి మండల సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువకులను చేరదీసి వారి చేత రాత్రి పూట ధాన్యాన్ని లారీలకు ఎక్కించి బయటకు తరలిస్తున్నట్లు సమాచారం. పెబ్బేరుకు చెందిన యువకుడి వాహనంలో ఈ ధాన్యం బయటకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఒక లారీ లోడు చేస్తే యువకులకు రూ.30వేలు కూలీల కింద ఇస్తున్నట్లు తెలిసింది. వారిని పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సీఎంఆర్ దందాలో ఇటు గద్వాలకు చెందిన ముగ్గురు మిల్లర్లతో పాటు పెబ్బేరు చెందిన కొంత మంది మిల్లర్ల భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నెలలో ఎర్రవల్లిలోని ఓ మిల్లు నుంచి నేరుగా అయిజ ఎంఎల్ఎస్ పాయింటుకు పీడీఎస్ బియ్యం సరఫరా చేసి దానిని సీఎంఆర్‌గా పాస్ చేయాలని మిల్లర్లు అధికారులపై ఒత్తిడి చేసి పాస్ చేయించినట్లు తెలిసింది. ఎర్రపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లు నుంచి అక్టోబర్ నెలలో రూ.20లక్షల విలువ చేసే పీడీఎస్ బియ్యం నేరుగా అయిజ ఎంఎల్ఎస్ పాయింట్‌లో డంప్ చేశారనే ఆరోపణలు అప్పుడు బలంగా వినిపించాయి

**విజిలెన్స్‌తో విచారణ చేయించాలి..**

జిల్లాలో సీఎంఆర్ అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తే మిల్లర్ల అక్రమాలు బయట పడే అవకాశం ఉంది. వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఏ మిల్లుకు ఎంత ధాన్యం కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మిల్లుల్లో ఉందా? లేక ఎక్కడైనా డంపింగ్ చేశారా? అనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. ఆ దిశగా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాల్సి ఉన్నది.





పెద్దమందడి మండలం బలిజపల్లిలో నిరసన దీక్ష చేపట్టిన గ్రామస్తులు

*రెండు గ్రామ పంచాయతీలను ఒకటిగా చేస్తారన్న ప్రచారం ఆ గ్రామంలో ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. మా గ్రామ పంచాయతీ మాకు ఉండాల్సిందే. మా పంచాయతీని మరొక గ్రామంలో విలీనం చేస్తే ఒప్పుకోమంటూ నాలుగు రోజులుగా నిరసన చేస్తున్నారు. చిలికి.. చిలికి గాలి వానలా మారుతున్న ఈ విలీనం ప్రతిపాదన రాజకీయ వైశ్యమ్యాలకు దారితీస్తున్నది. పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయిపల్లి గ్రామ పంచాయతీలను విలీనం చేసి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న ప్రయత్నంలో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నది.*

*– వనపర్తి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)*

- జంట గ్రామాల్లో పంచాయితీ
- తమ పల్లె గ్రామ పంచాయతీగా ఉండాలంటున్న బలిజపల్లి వాసులు
- రెండు గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు
- నాలుగు రోజులుగా సాగుతున్న దీక్షలు
- నేడు రెండు గ్రామాల్లో గ్రామసభలు

# విలీన వివాదం!

పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామం బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. అంతకు ముందు జంగమాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడం, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం, గ్రామ పంచాయతీగా కొనసాగడం జరిగింది. ఈ రెండు గ్రామాలకు మధ్యలో కేవలం రోడ్డు మాత్రమే హద్దుగా ఉంటుంది. గ్రామాలు దాదాపుగా కలిసే ఉంటాయి. అయితే రెవెన్యూ పరంగా అంతా వేర్వేరుగా ఉండడం, గ్రామ పంచాయతీల వ్యవస్థను గత సీఎం కేసీఆర్ ప్రోత్సహించడంతో బలిజపల్లిని కూడా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. తొలి గ్రామ సర్పంచుగా జయంతి ఎన్నిక కాగా, అలాగే జంగమాయిపల్లికి సతీశ్ సర్పంచ్‌గా ఎన్నిక కాగా, వారి పదవీ కాలం కూడా ముగిసింది. ఈమేరకు కొత్తగా జీపీ అయిన బలిజపల్లికి కావాల్సిన కొన్ని అభివృద్ధి పనులను కూడా చేయించుకున్నారు. బలిజపల్లి జనాభా 2,691 ఉంటే, జంగమాయిపల్లి జనాభా 1,732 ఉంది. ఇలా వీరిద్దరి మధ్య సుమారు వెయ్యి జనాభా తేడా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన అభివృద్ధి నిధుల మంజూరులను చేస్తుండటం విధితమే.

**విలీనం వద్దు.. వేర్వేరే ముద్దు**

ప్రత్యేక గ్రామ పంచాయతీగా కొనసాగిన బలిజపల్లిని మళ్లీ జంగమాయిపల్లి జీపీలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను తాము అంగీకరించబోమని బలిజపల్లి గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులకు విన్నవించడం, ధర్నాలు, రిలే నిరసన దీక్షలను కొనసాగిస్తూ తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. నాలుగురోజులుగా గ్రామంలో దీక్షలను చేస్తూ విలీనం తమకు వద్దని పట్టుపడుతున్నారు. ముందుగా రోడ్డుపై ధర్నాకు దిగిన క్రమంలో తాసీల్దార్, ఆర్డీవో, డీఎస్పీ లాంటి అధికారులు వెళ్లి సర్ది చెప్పారు. అయితే తమ నిరసనను దీక్షల ద్వారా కొనసాగిస్తామని క్రమంగా ముందుకు నడుస్తున్నారు. విలీనాన్ని అడ్డుకునేందుకు ఎంతవరకైనా సరే అన్నట్లు గ్రామస్తులు ఏకాభిప్రాయంతో కదులుతున్నారు.

**మండల కేంద్రం ప్రతిపాదనతో..**

బలిజపల్లి–జంగమాయిపల్లి గ్రామాలను ఒకే గ్రామ పంచాయతీ పరిధిలోకి తెస్తూ నూతన మండలంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనకు వెళ్లింది. ఈ క్రమంలోనే జంట గ్రామాలుగా ఉన్న బలిజపల్లి, జంగమాయిపల్లికి గతంలో నుంచి కొంత సరిహద్దు సమస్య ఉంది. రెవెన్యూ పరంగా వేర్వేరుగా ఉన్నప్పటికీ సరిహద్దుల వ్యవహారంలో గతంలో కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని రెండు గ్రామాలను ఒకే గ్రామ పంచాయతీగా చేసి 'మంజునాథపురం' అన్న పేరుతో కొత్త మండలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రయత్నం ప్రభుత్వ పరిశీలనకు వెళ్లింది. ఈ సమాచారం తెలుసుకున్న బలిజపల్లి గ్రామస్తులు తమ గ్రామ పంచాయతీని ఎట్టి పరిస్థితిలో జంగమాయిపల్లిలో విలీనానికి అంగీకరించబోమని భీష్మించుకున్నారు. మండల కేంద్రం ఏర్పాటైతే తమకు సంతోషమేనని, జీపీ విలీనం మాత్రం కుదరదని పట్టుదలతో ఉన్నారు.

**నేడు రెండు ప్రత్యేక గ్రామ సభలు**

బలిజపల్లి, జంగమాయిపల్లి గ్రామాల విలీనంపై అభిప్రాయాలు సేకరణకు జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో అధికారులు రెండు వేర్వేరుగానే గ్రామ సభలను నిర్వహించేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల సంతకాలతో కూడిన నోటీసులను గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఉదయం 8గంటలకు బలిజగ్రామ సభ, అనంతరం పది గంటలకు జంగమాయిపల్లి గ్రామ సభ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. రెండు గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిణిగా పెద్దమందడి ఎంపీవో పుష్పలత ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించ బోతున్నారు. ఇదిలా ఉంటే బలిజపల్లి గ్రామస్తులు సభను సీరియస్‌గా తీసుకుంటున్నారు. హైదరాబాద్‌తోపాటు ఇతర సుదూర ప్రాంతాల్లో ఉన్న ఈ గ్రామస్తులందరిని ప్రత్యేకంగా గ్రామసభను దృష్టిలో ఉంచుకుని పిలుపించుకుంటున్నారు. ఈ క్రమంలో రెండు, మూడు వందల మంది వరకు బయట ఉన్న గ్రామస్తులు కూడా వస్తారని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే రెండు గ్రామాల మధ్య విలీనం ప్రతిపాదన ఉద్రిక్తంగా మారుతున్న వేళ అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. సభల సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం సముచితం.



బలిజపల్లి గ్రామ పంచాయతీ భవనం

**ప్రజల సౌకర్యం కోసమే..**



గతంలో కలిసి ఉన్న రెండు గ్రామాలను విలీనం చేసి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఏ ప్రతిపాదన చేసినా ప్రజల సౌకర్యం కోసమే ఉంటుంది. జీపీలుగా వేర్వేరుగా ఉండటం వల్ల సరిహద్దు సమస్యలున్నాయి. ఒకే పంచాయతీ పరిధిలో ఉండటం ద్వారా సమస్యలు రాకూడదన్నదే ఉద్దేశం. తప్పుగా అర్థం చేసుకుని వ్యక్తిగత రాజకీయం అనడం కరెక్ట్ కాదు. ఇప్పుడున్న పరిస్థితిలో మండల కేంద్రానికి వెళ్లడానికి గ్రామస్తులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో చూసిన వాళ్లకు అర్థమవుతుంది. విలీనానికి ఏకాభిప్రాయం వస్తే సరి. రాకున్నా మండల ఏర్పాటు ఆగదు. మండల కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**– రమేశ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ, బలిజపల్లి, వనపర్తి జిల్లా**

**మా పంచాయతీ మాకుండాలి**



మా గ్రామ పంచాయతీని జంగమాయిపల్లిలో విలీనం చేయడాన్ని మేం అంగీకరించం. గ్రామం మొత్తం ముక్తకంఠంగా చెబుతున్న అభిప్రాయమే నేను చెబుతున్నా. ఏ ఒక్కరికీ ఇష్టం లేదు. గతంలో రెండు గ్రామాల మధ్య ఉన్న వైశ్యమ్యాలను తొలగించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేర్వేరుగా జీపీలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక జీపీ ద్వారా అనేక నూతన అభివృద్ధి పనులు చేసుకున్నాం. ఇంత చేసుకున్న తర్వాత మళ్లీ రెండు జీపీలను విలీనం చేసి తగవులు పెట్టడం తప్పా మరొకటి లేదు. గ్రామ సభ తీర్మానం లేకుండానే విలీనం ప్రతిపాదన వెళ్లింది. దీన్ని మేం ఒప్పుకునేది లేదు. మండలం ఏర్పాటు చేస్తే సంతోషిస్తాం.

**– డాక్టర్ జయంతి, మాజీ సర్పంచ్, బలిజపల్లి, పెద్దమందడి మండలం, వనపర్తి జిల్లా**



లబ్ధిదారులకు ఎల్‌వోసీని అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా..

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 26 : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అయిజ మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన తెలుగు సుజాతకు సీఎం సహాయనిధి నుంచి ఆపరేషన్ కోసం రూ.5లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నారు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్న ఎంతో మందికి ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నామన్నారు. ఎవరికీ ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుల్లూరు రఘురెడ్డి, లోకేశ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలియజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## ఒంటికాలిపై నిలబడి..

- మహబూబ్‌నగర్‌లో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 17వ రోజు కొనసాగిన సమ్మె

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసనలు హోరెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకో విధంగా వినూత్న రీతిలో కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరికి పలువురు నాయకులు మద్దతు తెలియజేస్తున్నారు. 17వ రోజు గురువారం మహబూబ్‌నగర్‌లో తమ పిల్లా పాపలతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. ఉద్యోగులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. గద్వాలలో రోడ్లను శుభ్రం చేసి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి పలువురు సంఘీభావం తెలిపారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 26